సాక్షి
గుంటూరు
మంగళవారం । 9 । జూలై । 2024



విజలెన్స్ తనిఖీలు

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు కలసి సోమవారం తనిఖీలు నిర్వహించారు.



ఉర్దూ పాఠశాలల సందర్శన

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎంపీపీ ఉర్దూ పాఠశాల, జడ్పీ ఉర్దూ పాఠశాలను సమగ్ర శిక్ష అసిస్టెంట్ స్టేట్ ఐఈడీ కోఆర్డినేటర్ జి.మల్లికార్జున సందర్శించారు.



ఆక్రమణల తొలగింపు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో గాంధీ పార్కు రోడ్డులో ఆక్రమణల తొలగింపు సోమవారం కొనసాగింది. అసిస్టెంట్ సిటీ ప్లానర్ జడ్.సుధాకర్ పరిశీలించారు.

న్యూస్‌రీల్

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి పేర్కొన్నారు. గుంటూరు నగరంపాలెం జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సోమవారం మోటార్ వాహనాల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ ర్యాష్ డ్రైవింగ్ చేయవద్దని చెప్పారు. వాహనాలు జాగ్రత్తగా నడపాలని పేర్కొన్నారు. 18 ఏళ్ల వయసు దాటని పిల్లలకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలను ఇవ్వవద్దని సూచించారు. ఒకవేళ వాహనాలు ఇస్తే చట్టరీత్యా నేరమన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే, వెయ్యి రూపాయల జరిమానా, మూడు నెలలు లైసెన్స్ రద్దు చేస్తారని హెచ్చరించారు. నాలుగేళ్లు నిండిన పిల్లలకూ బండిపై తీసుకెళ్లేటప్పుడు హెల్మెట్ వాడటం తప్పనిసరి అని వివరించారు. ఒక కుటుంబంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే నష్ట పరిహారంగా డబ్బులు చెల్లిస్తే సరిపోదని, ప్రమాదాలు జరగకుండా వాహన చోదకులు రహదారులపై జాగ్రత్తగా నడపాలని సూచించారు. సంస్థ జిల్లా కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణం సురక్షితం కాదని అన్నారు. కుటుంబ సభ్యులను గుర్తుంచుకుని, వాహనాలను నెమ్మదిగా డ్రైవ్ చేయాలన్నారు. సదస్సులో కక్షిదారులు, కోర్టు సిబ్బంది, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్స్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ హాల్‌లో..

జిల్లా కోర్టు ఆవరణలోని గుంటూరు బార్ అసోసియేషన్‌లో హెల్మెట్ వాడకపోతే కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహిచారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనురాధ, ఈసీ సభ్యులు ఎస్.బి.ఎ.ఝాన్సీ, కట్టా కాళిదాసు, శ్రీనివాసమూర్తి, రామకృష్ణారెడ్డి, ప్రత్యూష న్యాయవాదులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి కాంట్రాక్టు పద్ధతిపై కొనసాగేందుకు అర్హులైన అధ్యాపకులు మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు దరఖాస్తులు అందజేయాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత విద్యాసంవత్సరంలో ఏప్రిల్ 30వ తేదీ నాటికి కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేసిన వారే దరఖాస్తుకు అర్హులని స్పష్టం చేశారు.

యార్డుకు 29,187 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 29,187 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 26,159 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 19,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.8,500 నుంచి రూ.16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.9,000 నుంచి రూ. 18,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 14.317 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

వైద్య సిబ్బంది పదోన్నతులకు దరఖాస్తు చేసుకోండి

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్ఓ, మేల్) పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ఆర్డీ డాక్టర్ జి.శోభారాణి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీహెచ్ఓ పోస్టులకు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఎంపీహెచ్ఈఓగా పనిచేస్తున్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీహెచ్ఈఓల సమాచారాన్ని వారి సర్వీసు రిజిస్టర్‌లను, ఇతర వివరాలను ఈనెల 12వ తేదీలోపు గుంటూరు ఆర్డీ కార్యాలయానికి అందజేయాలన్నారు.

మరపురాని మహానేత

- వైఎస్సార్ పాలన స్వర్ణయుగం
- వాడవాడలో వైఎస్సార్ జయంత్యుత్సవం
- హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు

అద్భుత పాలనతో జనహృదయాలు గెలుచుకున్న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిని ప్రజలు మనసారా స్మరించుకున్నారు. ఆయన జయంత్యుత్సవాన్ని జిల్లావ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. మరణం లేని మహానేతా... నిను మరువం అంటూ నినదించారు.



వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాయంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షులు మందపాటి శేషగిరిరావు, మాజీ మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, మేయర్ కావటి మనోహరనాయుడు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, వజ్రబాబు, దయాసాగర్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వైఎస్ రాజశేఖరరెడ్డి మరపురాని మహానేత అని వక్తలు కొనియాడారు. ఆయన పాలన స్వర్ణయుగమని, వైఎస్సార్ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని అభివర్ణించారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంత్యుత్సవం సోమవారం వాడవాడలా వైభవంగా జరిగింది. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

- వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, పార్టీ జిల్లా అధ్యక్షులు మందపాటి శేషగిరిరావు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ మంత్రి విడదల రజిని, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా, జీడీసీసీబీ మాజీ చైర్మన్ లాలుపురం రాము, మచిలీపట్నం పోర్ట్ అథారిటీ మాజీ ఎండీ మేకతోటి దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ జన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో ప్రజలకు ఎంతో మేలు చేశారని పేర్కొన్నారు.
- తెనాలి రణరంగచౌక్‌లోని డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శివకుమార్ నేతృత్వంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పుష్పాంజలి ఘటించారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత అనే పదాలకు నిజమైన అర్థం చెప్పిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని, ఆయన చూపిన బాటలోనే ఎన్నటికీ పేదల పక్షానే నిలుస్తామని అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పార్టీ క్లస్టర్–1,2 అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- మంగళగిరిలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి కేక్ కట్ చేశారు. తాడేపల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాడేపల్లి అంజిరెడ్డి భవన్‌లో వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దుగ్గిరాలలో ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఆళ్ళ రవిదేవరాజు ఆధ్వర్యంలో ఏటుకూరులో వైఎస్సార్‌కు నివాళులర్పించారు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వైఎస్సార్ అని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి తెలిపారు. అమరావతిరోడ్డు నగరాలులో నగరాలు డివిజన్ కన్వీనర్ ఆరిక శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు నివాళులర్పించారు.
- పొన్నూరు నియోజకవర్గంలోని పెదకాకాని, చేబ్రోలు, పొన్నూరు మండలాల్లో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో మహానేత వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, సర్పంచ్ జాలాది యానాదిరావు పాల్గొన్నారు.
- తాడికొండ నియోజకవర్గంలోని ఫిరంగిపురం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ జయంత్యుత్సవం నిర్వహించారు. వైఎస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కె. చిన్నప్పరెడ్డి, వైస్ ఎంపీపీ జి.చంద్రం పాల్గొన్నారు.



రామిరెడ్డితోటలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నూరి ఫాతిమా



పొన్నూరులో వైఎస్సార్ విగ్రహానికి నమస్కరిస్తున్న అంబటి మురళీకృష్ణ



మంగళగిరిలో కేక్ కట్ చేస్తున్న మురుగుడు, గంజి చిరంజీవి, వేమారెడ్డి తదితరులు



గుంటూరులోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దయాసాగర్



కొలకలూరులో విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

ఉచిత ఇసుక సరఫరాలో ఇబ్బందులు రాకూడదు

ఇసుక స్టాక్ పాయింట్ తనిఖీలో కలెక్టర్ నాగలక్ష్మి



కొల్లిపరలోని స్టాక్ పాయింట్ వద్ద అధికారులతో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

తెనాలి: ఉచిత ఇసుక సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీచేసిన విధివిధానాల ప్రకారం లోడింగ్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు జరక్కుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టంచేశారు. కొల్లిపరలోని ఇసుక స్టాక్ పాయింట్‌ను సోమవారం కలెక్టర్ పరిశీలించారు. స్టాక్ పాయింట్ వద్ద నిర్వహిస్తున్న రిజిస్టర్లను, రికార్డులను తనిఖీ చేశారు. పలు సూచనలు చేశారు. ఉచిత ఇసుక విధానంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మైనింగ్, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో చర్చించారు. ఇసుక స్టాక్ పాయింట్ యార్డులో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌తో టన్ను ఇసుకకు రూ.250 చెల్లించాలని చెప్పారు. ప్రభుత్వ నూతన మార్గదర్శకాల ప్రకారం ఒక్కొక్కరికి ఒక రోజుకు 20 టన్నుల ఇసుకను సరఫరా చేయాల్సి ఉందని పేర్కొన్నారు. స్టాక్ పాయింట్‌లో ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే టోల్‌ఫ్రీ నంబర్ 0863–2234301, మెయిల్ ఐడీ dismc2024@gmail.comకు ఫిర్యాదుచేయాలని సూచించారు. ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్టాక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాల ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని మైనింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మైనింగ్‌శాఖ ఉపసంచాలకులు చంద్రశేఖర్, కొల్లిపర తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో విష్ణుప్రసాద్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ గంగాధరం, ఈవోపీఆర్డీ పూర్ణశంకరరావు, డీఆర్‌డీఏ ఏపీఎం ప్రియదర్శిని, ఆర్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిర్ణయించిన మేరకే రవాణా చార్జీలు వసూలు చేయాలి

డీటీసీ షేక్ కరీం

నెహ్రూనగర్: ప్రభుత్వం ఉచిత ఇసుక రవాణా పథకంలో భాగంగా జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయించిన మేరకే రవాణా చార్జీలు వసూలు చేయాలని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం పేర్కొన్నారు. సోమవారం లారీ, ట్రాక్టర్స్ యాజమానులతో ఆర్టీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరు టైర్ల లారీకి 15 కిలోమీటర్ల వరకు రూ.2 వేలు, 16 నుంచి 30 కిలోమీటర్ల వరకు రూ.3,500, 31 నుంచి 45 కిలోమీటర్ల వరకు 4,500, 46 నుంచి 60 కిలోమీటర్ల వరకు రూ.5,500 వసూలు చేయాల్సి ఉంటుందన్నారు. 10 టైర్, 12 టైర్ లారీలకు కొద్ది మేర వ్యత్యాసంతో రవాణా చార్జీలు నిర్ణయిస్తామని పేర్కొన్నారు. ట్రాక్టర్లకు రూ.1,500 నుంచి రూ.3,500 వరకు మాత్రమే వసూలు చేయాల్సి ఉంటుందని చెప్పారు.



లారీ, ట్రాక్టర్ల యాజమానులతో సమావేశమైన డీటీసీ కరీం

పారదర్శకంగా 'ఉచిత ఇసుక'

కలెక్టర్ నాగలక్ష్మి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ప్రజలకు ఇసుకను అందించేందుకు కృషి చేస్తోందని, దీనిని విజయవంతం చేసేలా అధికారులు సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఐదు ఇసుక రీచ్‌ల ద్వారా ఇసుక సరఫరా పారదర్శకంగా జరుగుతుందని పేర్కొన్నారు. టన్నుకు రూ.250 సాధారణ ఖర్చు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఇసుక అక్రమార్కుల పాలు కాకుండా చూడాలని, ప్రజలకు సజావుగా అందేలా అధికారులు పనిచేయాలన్నారు. ఇసుక సరఫరాకు సంబంధించి వచ్చే ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం వచ్చిన 204 ఫిర్యాదులను కలెక్టర్, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా అధికారులు పరిశీలించారు.

తప్పుడు కేసు నమోదు చేశాడు



గతంలో తక్కెళ్ళపాడు పంచాయతీకి సంబంధించిన స్థలంలో అక్రమంగా పెద సుబ్బారావు అనే వ్యక్తి గోడ నిర్మించాడు. దీనిపై మేం అధికారులకు ఫిర్యాదు చేయగా ఆయన మాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాడు. వాస్తవానికి అతను బీసీ కులస్తుడు. అయినా తప్పుడు సర్టిఫికెట్ తీసుకుని మాపై అక్రమ కేసు నమోదు చేశాడు. న్యాయం చేయండి.

– ఎ.లింగయ్య, ఎం.వేణుకుమార్, ఎం.మల్లికార్జునరావు

నా బిడ్డ మరణానికి కారకులను అరెస్ట్ చేయాలి



నా కుమార్తెను ఒక వ్యక్తి ఇంటి నుంచి తీసుకు వెళ్ళిపోయాడు. పెద్దలకు తెలీకుండా వివాహం చేసుకుని చివరికి నా బిడ్డ మరణానికి కారణమయ్యాడు. ఆ వ్యక్తి ఆటో డ్రైవర్. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోకపోగా మాపైనే కేసులు బనాయించారు. మాకు న్యాయం చేయండి.

– శంకరలీల, గుంటూరు

బెజవాడలో కిడ్నీ రాకెట్!

- ఫేస్‌బుక్‌లో ప్రకటన చూసి మోసపోయిన గుంటూరు యువకుడు
- శస్త్రచికిత్స చేసి కుడి వైపు కిడ్నీ తొలగించారని ఆవేదన
- రూ.30 లక్షలకు కేవలం రూ.1.09 లక్షలే ఇచ్చారని వెల్లడి
- గుంటూరు పోలీసులకు ఫిర్యాదు
- గత నెలలో 5 రోజుల్లో 10 ఆపరేషన్లు చేసినట్లు వెల్లడి



గుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేసిన మధుబాబు, అతని భార్య



శస్త్రచికిత్స జరిగిన ప్రదేశాన్ని చూపుతున్న మధుబాబు

నగరంపాలెం (గుంటూరు): విజయవాడలో కిడ్నీ రాకెట్ బయటపడింది. కిడ్నీ దానం చేస్తే పెద్ద మొత్తంలో డబ్బు ఇస్తామంటూ యువకులకు ఆశ చూపి, కిడ్నీ తీసుకున్న తర్వాత వారికి అతి తక్కువ మొత్తంలో డబ్బు ఇచ్చి మోసం చేస్తున్న వ్యవహారం వెలుగుచూసింది. ఫేస్‌బుక్‌లో ఇలాంటి ప్రకటన చూసి తన అప్పులు తీరిపోతాయని, కష్టాలు తొలగుతాయని ఆశపడ్డ గుంటూరు యువకుడు నిలువునా మోసపోవడమే కాకుండా, అనారోగ్యానికి కూడా గురయ్యాడు. దీనిపై అతను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీవో)లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాడు. బాధితుడు, అతని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నగరం కేవీపీ కాలనీకి చెందిన గార్లపాటి మధుబాబు (31)కి వివాహమైంది. తొమ్మిదేళ్ల బాబు, మూడేళ్ల పాప సంతానం. ఇంటర్ వరకు చదువుకుని ఆటోడ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. చిరు వ్యాపారాలు చేసి నష్టపోయాడు. తెలిసిన వారు, లోన్ యాప్‌ల ద్వారా రూ.8 లక్షలు వరకు అప్పులు తీసుకున్నాడు. కుటుంబ పరిస్థితులు, పిల్లల పోషణ భారమైంది. గతేడాది నవంబర్‌లో ఫేస్‌బుక్‌లో కిడ్నీ దానం చేయాలనే ప్రకటన చూశాడు. దాన్ని క్లిక్ చేయగా బాషా అనే వ్యక్తి పరిచయమయ్యాడు. అతని ద్వారా వెంకట్ పరిచయమై, కిడ్నీ అవసరమైన రోగి నుంచి సుమారు రూ.30 లక్షలు ఇప్పిస్తామని నమ్మబలికారు. విజయవాడలో రోగి బావమరిది అంటూ ఎస్.సుబ్రమణ్యం అనే వ్యక్తిని పరిచయం చేశారు. మధుబాబు కుటుంబ పరిస్థితి తెలుసుకొని అతనిపై అపారమైన ప్రేమను చాటారు. ముందుగా కొద్ది మొత్తం డబ్బు ఆన్‌లైన్‌లో పంపారు. రక్త పరీక్షలు, ధ్రువీకరణ పత్రాలకు తగినట్లు అన్ని డాక్యుమెంట్లు తీసుకున్నారు. ఆధార్ కార్డు ఆధారంగా మార్పులు చేశారు. అనుమతి లేకుండా ఒక తల్లిని సృష్టించి కుటుంబ ధ్రువీకరణ పత్రం కూడా తీసుకున్నారు. అనంతరం వారికి అనుకూలంగా మధ్యవర్తి, ఆసుపత్రి నిర్వాహక వైద్యులు వీడియోలు తీయించుకున్నారు. లేకపోతే డబ్బులు రావని బెదిరించారు. గతనెల 10న ఆసుపత్రిలో చేరగా, 15న శస్త్రచికిత్స చేసి కుడి వైపు కిడ్నీ తొలగించి మరో రోగికి అమర్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 1,09,500 మాత్రమే చెల్లించారు. డిశ్చార్జ్ తర్వాత మిగతా డబ్బు అడిగితే ఇబ్బందులు పెట్టడం మొదలెట్టారు. గట్టిగా అడిగితే కిడ్నీ తొలగించిన తమకు ప్రాణం తీయడం పెద్ద పనేమీ కాదంటూ బెదిరించారు. దీంతో మోసపోయానని మధుబాబుకు అర్థమైంది. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనను మోసగించిన మధ్యవర్తులు, ఆసుపత్రి వైద్యునిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరాడు. ఆ ఆస్పత్రిలో గత నెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు 5 రోజుల్లో సుమారు 10 శస్త్రచికిత్సలు చేశారని, అవన్నీ మోసపూరితమైనవేనని తెలిపాడు.

'క్యూ'..ఆర్ కోడ్ ఇక్కట్లు



రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఉచిత ఇసుక విధానం తొలిరోజే ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ఉదయం ఆరుగంటలకే స్టాక్ పాయింట్ వద్ద క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి ప్రభుత్వానికి నిర్ణయించిన ధర చెల్లించి ఇసుక తీసుకెళ్లాలని అధికారులు సూచించారు. ఉచిత ఇసుక కోసం ఎంతో ఆశతో కొల్లిపర మండలంలోని ఇసుక స్టాక్ పాయింట్ వద్దకు లారీలు, ట్రాక్టర్లు తీసుకొచ్చిన లబ్ధిదారులు క్యూఆర్ కోడ్ పని చేయకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. సాయంత్రం ఆరు గంటల వరకు క్యూఆర్ కోడ్ ప్రజలను ఇబ్బంది పెట్టింది. ఫలితంగా లారీలు, ట్రాక్టర్లు చాలా దూరం వరకు బారులు తీరి నిలిచిపోయాయి. సాయంత్రం ఏడుగంటల సమయానికి ఐదు వాహనాలకు మాత్రమే అధికారులు ఇసుకను లోడ్ చేయగలిగారు. – కొల్లిపర

క్లుప్తంగా

నంబూరులో 24 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పెదకాకాని: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామం నుంచి రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. తనిఖీలు నిర్వహించిన పోలీసులు గ్రామంలోని గుంటూరు రూరల్ మండలం, రెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొంటిగుర్లు ఏడుకొండలును అదుపులోకి తీసుకున్నారు. టాటా ఏస్ మినీ వాహనంలో తరలిస్తున్న 24 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. 48 గోనె సంచుల్లో 50 కిలోలు చొప్పున తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్టేషన్‌కు తరలించారు. నిందితుడు ఏడుకొండలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సోమవారం పెదకాకాని సీఐ కె.వీరాస్వామి తెలిపారు. పలువురు అక్రమార్కుల కనుసన్నల్లో రేషన్ బియ్యం జాతీయ రహదారిపై నుంచి కాకినాడ పోర్టుకు తరలిపోతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఉద్యోగులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

ఏపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా



గుంటూరు వెస్ట్: ఉద్యోగులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని ఏపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో చాంద్ బాషా మాట్లాడుతూ తమ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం నగరంలో ర్యాలీ నిర్వహించి డీఆర్వో పెద్ది రోజాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు శివారెడ్డి, కరీముల్లా షాఖాదరి, హుస్సేన్ ఖాన్, సుమిత్రా దేవి, హేమలత, ఆశ సజని, అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

నిర్దేశించిన గడువులోగా సమస్యలు పరిష్కరించండి

- జిల్లా ఎస్పీ తుషార్ డూడీ
- ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ



బాధితుల సమస్య ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ

నగరంపాలెం: భోజనాల ఆర్డర్లు చెప్పి మోసగిస్తున్న వారిపై సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవర ణలోని హాల్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒకరు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలను కూలంకుషంగా అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ల పోలీస్ అధికారులకు ఫోన్ల ద్వారా బాధితుల ఫిర్యాదులను తీసుకొచ్చారు. చట్ట ప్రకారం విచారణ చేపట్టి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదిదారుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిర్యాదిదారుల పట్ల అలసత్వం చూపొద్దని అన్నారు. జిల్లా ఏఎస్పీలు (పరిపాలన) జీవీ.రమణమూర్తి, డీఎస్పీలు వివి.నాయుడు (ట్రాఫిక్), శివాజీరాజు (క్రైం), మల్లికార్జునరావు (ఎస్టీ ఎస్సీ సెల్) కూడా ఫిర్యాదులు స్వీకరించారు.

క్యాటరింగ్ పేరుతో మోసం..

క్యాటరింగ్ చేసేవాడ్ని. ఈనెల 3న ఓ వ్యక్తి యాప్ ద్వారా నంబర్ సేకరించి ఇద్దరు వ్యక్తులు కాల్ చేశారు. వారిద్దరూ కూడా సీఎంఓ పరిపాలన విభాగం, ఏపీ స్టేట్ వెండర్ అని, వెలగపూడి సచివాలయం నుంచి మాట్లాడుతున్నామని బదులిచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు భోజనం సరఫరా చేయాలని చెప్పారు. దీనికై వెండర్ కోడ్ తీసుకోవాలని, సచివాలయంలోనికి రావాలంటే రూ.25 వేలు డిపాజిట్ చేయాలని నమ్మబలికారు. డబ్బులు డిపాజిట్ చేయగా, ఆర్డర్ ఇవ్వలేదు. అదేమని అడిగితే సరైన సమాధానం లేదు. దీనిపై సైబర్ క్రైంలోనూ ఫిర్యాదు చేశా. న్యాయం చేయగలరు. – బి.హరిబాబు, గణేష్‌వారి వీధి, కొత్తపేట.

పొలం ఆక్రమించుకుని..

నాలుగేళ్ల కిందట తెలిసిన ఓ వ్యక్తి వద్ద కుటుంబ అవసరాల నిమిత్తం రూ.2.50 లక్షలు తీసుకున్నా. అసలు, వడ్డీ చెల్లిస్తూనే ఉన్నా. అయినప్పటికీ చేబ్రోలులోని నా ఎకరన్నర పొలంపై కన్నేశాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.10 లక్షలు వరకు చెల్లించాల్సి ఉంది. బాకీ రూపేణా పొలం రాసివ్వాలని ఒత్తిడి చేసేవాడు. కొద్ది రోజుల కిందట తన పొలం ఆక్రమించుకుని, సొంతంగా వరి పంట వేశాడు. న్యాయం చేయగలరు. – ఆలపాటి శ్రీను, చేబ్రోలు.

ఉద్యోగం పేరుతో..

స్తంభాలగరువుకి చెందిన వ్యక్తి పరిచయమై, కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికారు. దీంతో రూ.2.50 లక్షలు కాజేశాడు. డబ్బులు తీసుకుని మూడేళ్లు అయినా ఉద్యోగం ఇవ్వలేదు. డబ్బులు అడిగితే సమాధానం లేదు. – టి.వైష్ణవి, పాతగుంటూరు

చర్యలు తీసుకోవాలి

కృష్ణనగర్‌లో స్థలం ఉంది. జీఎంసీ వారు తమదని బలవంతంగా లాగేసుకున్నారు. ఇబ్బందులకు గురిచేస్తున్న జీఎంసీ వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా. – సీహెచ్.శ్రీనివాసరావు, లక్ష్మీపురం.

ఆర్టీసీ డిపో సేవల విస్తరణకు చర్యలు

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



కొత్త బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి మనోహర్, డీపీటీవో రవికాంత్

తెనాలిఅర్బన్: ఆర్టీసీ డిపో సేవల విస్తరణకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలి ఆర్టీసీ డిపోకు కొత్తగా వచ్చిన ఆరు బస్సులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు రెండు బస్సులు, మిగిలిన నాలుగు బస్సులు విజయవాడకు నడపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారానికి రూ.30 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గుంటూరు డీపీటీఓ రవికాంత్ మాట్లాడుతూ నెల్లూరు డివిజన్‌లో నంబర్-2గా ఉన్న తెనాలి డిపోను నంబర్ వన్ స్థానంలో ఉంచేలా కృషి చేయాలన్నారు. అనంతరం మనోహర్‌ను ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, డీఎస్పీ రమేష్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఆర్డీవో కె.ప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాఘవకుమార్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ ఐ.జె.ప్రసాద్, అసిస్టెంట్ మెకానిక్ ఇంజినీర్ ఎస్.అభిరామ్ నాయక్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్లే ధరలు, నిరుద్యోగం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

లక్ష్మీపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగానే దేశంలో నిరుద్యోగం, నిరక్షరాస్యత, ధరల పెరుగుదల వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని శాసన మండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు చెప్పారు. స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు అధ్యక్షతన జరుగుతున్న జిల్లా కార్యకర్తల క్లాసులలో రెండో రోజు కేఎస్ లక్ష్మణరావు "నయా ఉదారవాద ఆర్థిక విధానాలు ప్రజలపై ప్రభావాలు" అనే అంశంపై మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. దీని ఫలితంగా కార్పొరేట్ సంస్థల అధిపతులు రూ.వేల కోట్లు అక్రమంగా గడిస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్రాల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విధానాలు– పార్టీ నిర్మాణం అనే అంశంపై సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయాలని, రాజధాని నిర్మాణం, విభజన చట్టంలోని హామీల అమలుకు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కోసం కేంద్రంపై పోరాడాలని పేర్కొన్నారు. జిల్లాలో యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు వై.నేతాజి, కె.నళినికాంత్, ఎస్.ఎస్.చెంగయ్య, ఎమ్.రవి, బూరుగ వెంకటేశ్వర్లు, డి.వెంకటరెడ్డి, బి.కోటేశ్వరి, డి.శ్రీనివాసకుమారి పాల్గొన్నారు.

రూ. 18.88 కోట్ల పురుగుమందులు, ఎరువుల విక్రయాలు నిలిపివేత



గోదాములో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు

కొరిటిపాడు: ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలు, గోదాముల్లో వ్యవసాయ, విజిలెన్స్ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. వేర్వేరు జిల్లాల నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు ఐదురోజులుగా జిల్లాలోని అన్ని మండలాల్లో తనిఖీలు చేస్తున్నాయి. సోమవారం యూపీఎల్, టస్టనైబుల్, అగ్రిసొల్యూషన్, గుంటూరు నగరంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డిపోల్లో రికార్డులు సరిగా నిర్వహించని కారణంగా రూ.2.44 కోట్ల విలువైన 18,628 లీటర్ల బయో ఉత్పత్తులు, రూ.16.44 కోట్ల విలువైన 39,921 కిలోల వివిధ రకాల పురుగు మందుల విక్రయాలు నిలిపివేశారు. మొత్తం రూ.18.88కోట్లు విలువైన ఎరువులు, పురుగు మందుల విక్రయాలు నిలిపివేశారు. అనుమతి లేని పురుగుమందులు నిల్వ చేసిన కారణంగా రూ.12.44 లక్షల విలువైన 1,135 లీటర్ల పురుగుమందులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఏడీఏలు కె.నాగేశ్వరరావు, బాలాజీ నాయక్, విజిలెన్స్ సీఐలు మాణిక్యరావు, శ్రీనివాసులు రెడ్డి, ఏఓ గౌతం ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రథమ ఆహ్వాన నాటికల పోటీలు ప్రారంభం



అన్నె రత్నప్రభాకర్‌కు పురస్కారం ప్రదానం



ఇంద్రప్రస్థ నాటికలో సన్నివేశం

తెనాలి:కళల తెనాలిలో కళా వారసత్వాన్ని సజీవం చేస్తూ వివిధ పరిషత్‌లు నాటికోత్సవాలను నిర్వహించటం అభినందనీయమని మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి చెప్పారు. రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్, తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ప్రథమ ఆహ్వాన నాటికల పోటీలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటైన ప్రారంభ సభకు ట్రస్ట్ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజకుమారి తన ప్రసంగంలో సమాజ చైతన్యానికి నాటకాలు ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్రస్థాయి ప్రథమ ఆహ్వాన నాటికల పోటీలు ఆ దిశగా ఉపకరిస్తాయని భావిస్తున్నట్టు చెప్పారు. రోటరీలో ఉత్తమ సేవలు అందించిన పూర్వ జిల్లా గవర్నర్ అన్నె రత్నప్రభాకర్‌కు రోటరీ వ్యవస్థాపకుడు పాల్ హారీస్ పురస్కారంతో సత్కరించారు. డాక్టర్ సోమవరపు వెంకట రాంప్రసాద్, రోటరీ పూర్వ అసిస్టెంట్ గవర్నర్ గుత్తా వెంకటరత్నం మాట్లాడారు. తొలుత అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి 'ఇంద్రప్రస్థం' నాటికను ప్రదర్శించారు. స్నిగ్ధ రచించిన నాటికకు ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు. రెండో ప్రదర్శనగా చైతన్య కళాభారతి, కరీంనగర్ సమాజంచే 'స్వప్నం రాల్చిన అమృతం' నాటికను ప్రదర్శించారు. బీఎస్ నారాయణ మూలకథను పరమాత్ముని శివరాం నాటకీకరించగా, మంచాల రమేష్ దర్శకత్వంలో ప్రదర్శించారు. చివరగా మిత్రా క్రియేషన్స్, హైదరాబాద్ వారి 'అందిన ఆకాశం' నాటికను ప్రదర్శించారు. సాయిపద్మశేఖర్ రచనకు, ఎంఎస్ బాషా దర్శకత్వ పర్యవేక్షణ చేశారు.

రోటరీ క్లబ్ తెనాలి అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, కన్నెగంటి మురళీకృష్ణ, నల్లూరి వెంకటేశ్వర్లు, డి.మురళీకృష్ణ, అరవపల్లి శ్రీకాంత్, కాకుమాను ఉపేంద్ర, జాన్ కీట్స్, ఆలపాటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వేధింపులను ఉపేక్షించం

కలెక్టర్ నాగలక్ష్మి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: పని ప్రదేశాల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, హింసను ఉపేక్షించే ప్రసక్తే లేదని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు ఉన్న చట్టాలపై అవగాహన పెంచాలన్నారు. స్థానిక ఫిర్యాదుల కమిటీ, అంతర్గత ఫిర్యాదుల కమిటీ గురించి ప్రతి అధికారి అవగాహన కలిగి ఉండాలన్నారు. తమ కార్యాలయాల్లో మహిళలు సురక్షితంగా పనిచేసే వాతావరణం కల్పించేందుకు కృషి చేయాలన్నారు. దీనికి సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు ధైర్యంగా తమ ఇబ్బందులను తెలియజేయాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, ఓఎస్‌సీ లీగల్ కౌన్సిలర్ విజయలక్ష్మి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, సీపీఓ శేషశ్రీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ వర్సిటీలో టీసీఎస్-ఎన్‌క్యూటీ ఇంటర్వ్యూలు



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న టీసీఎస్-ఎన్‌క్యూటీ (నేషనల్ క్వాలిఫైడ్ టెస్ట్) ఇంటర్వ్యూలను సోమవారం టీసీఎస్ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీసీఎస్ ప్రతినిధులు మాట్లాడుతూ 2024 సంవత్సరంలో బీటెక్ పూర్తి చేసి ఎన్‌క్యూటీ (నేషనల్ క్వాలిఫైడ్ టెస్ట్) ద్వారా ఎంపికైన విద్యార్థులకు విజ్ఞాన్ వర్సిటీలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మెగా డ్రైవ్‌కు ఉమ్మడి గుంటూరు, కృష్ణ, వైజాగ్ ప్రాంతాల్లోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన మూడు వేల మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఇంటర్వ్యూలో సత్తా చాటిన విద్యార్థులకు టీసీఎస్-నింజా రూ.3.39 లక్షలు, టీసీఎస్-డిజిటల్ రూ.7 లక్షలు, టీసీఎస్ ప్రైమ్ రూ.9 లక్షల వార్షిక వేతనం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టీసీఎస్ కంపెనీ ప్రతినిధులు, విజ్ఞాన్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ సైట్‌లో ఎన్‌ఎంఎంఎస్ మెరిట్ కార్డులు

గుంటూరు ఎడ్యుకేషన్: గతేడాది డిసెంబర్ 3న జరిగిన జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)లో ఎంపికైన విద్యార్థుల మెరిట్ కార్డులను ప్రభుత్వ పరీక్షల విభాగ సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సోమవారం తెలిపారు. విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌లో ఉంచిన మెరిట్‌కార్డులను డౌన్‌లోడ్ చేసుకుని, తమ పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఆధార్‌కార్డు వివరాలు సరిగా ఉన్నవీ, లేనివీ తనిఖీ చేసుకోవాలని సూచించారు. అలాగే ఆగస్టు 31లోపు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుని, సంబంధిత పాఠశాల నోడల్ అధికారితో పాటు జిల్లా నోడల్ అధికారి లాగిన్ ద్వారా అమోదింపజేసుకోవాలని తెలిపారు. ముద్రించిన మెరిట్‌కార్డులను త్వరలో డీఈవో కార్యాలయం నుంచి పొందవచ్చునని, విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టినతేదీ మెరిట్‌కార్డులో ముద్రించబడినట్లుగా ఆధార్‌కార్డులో ఉండాలని, ఒకవేళ వివరాల్లో ఏమైనా తప్పులు ఉన్నట్లయితే ఆధార్ మిస్ మ్యాచ్ వివరాలను సంబంధిత పాఠశాలల హెచ్ఎంల ద్వారా డీఈవో కార్యాలయానికి అందజేయాలని సూచించారు. విద్యార్థి ఆధార్, విద్యార్థి పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాకు విధిగా అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

'అరుణ తార' అంకురార్పణ ఇక్కడే

- మార్క్సిస్టు పార్టీ తొలి సన్నాహక సదస్సుకు వేదిక తెనాలి
- కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పరిణామం
- చరిత్రలో తెనాలి కన్వెన్షన్‌గా పేరుపొందిన ఘట్టం
- నేటితో సదస్సుకు అరవై వసంతాలు పూర్తి



తెనాలి సదస్సులో పాల్గొన్న ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ జాతీయ కౌన్సిల్ నుంచి వాకౌట్ చేసిన సభ్యులు (పాతచిత్రం)



తెనాలి సదస్సు ప్రాంగణంలో చర్చించుకుంటున్న పుచ్చలపల్లి సుందరయ్య, జ్యోతిబసు, ప్రమోద్‌దాస్ గుప్త (పాతచిత్రం)

తెనాలి: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకత్వంలో అంతరంగిక పోరాటం, ఆ పార్టీ చీలికకు దారితీయటం, చీలికవర్గం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)గా పునర్నిర్మాణం చెందటం చరిత్ర. ఇందుకోసం జరిగిన జాతీయస్థాయి సన్నాహక సదస్సుకు పోరాటాల పురిటిగడ్డ తెనాలి ఆతిథ్యమిచ్చింది. తెనాలి కన్వెన్షన్‌గా పిలిచిన ఈ సదస్సు జరిగి నేటితో అరవై వసంతాలు.

32 మంది తిరుగుబావుటాతో..

భారత కమ్యూనిస్టు పార్టీలోని ఒక సెక్షన్ పోకడలపై నాయకత్వంలో అసంతృప్తి నెలకొంది. 1961లో విజయవాడలో జరిగిన ఉమ్మడి పార్టీ చివరి మహాసభలోనూ ఈ విభేదాలు పరిష్కారం కాలేదు. కమ్యూనిస్టు ఉద్యమం ఐక్యంగా ఉండటానికి ప్రజాతంత్ర విరుద్ధంగా జరుగుతున్న కార్యక్రమాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని, పార్టీలో ఐక్యతకు అన్నిస్థాయిల్లో చర్చలు జరగాలంటూ జాతీయ కౌన్సిల్‌కు ఇచ్చిన నోటీసును నాయకత్వం తిరస్కరించింది. దీనితో 32 మంది జాతీయ కౌన్సిల్ సభ్యులు వాకౌట్ చేశారు. పార్టీని విప్లవ పంథాలో పునర్నిర్మించాలని వారు తీసుకున్న నిర్ణయం ప్రకారమే 1964 జూలై 9, 10, 11 తేదీల్లో తెనాలిలో జాతీయ సదస్సును నిర్వహించారు.

విజయవాడలో అనుమతి లేక..

తొలుత ఈ సదస్సును విజయవాడలో జరపాలని ఆలోచించారు. తగిన అనుకూల వాతావరణం ఆరోజున విజయవాడలో లేదు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ మధ్య విభేదాలు, ఉద్రిక్తతలే ఇందుకు కారణం. పోలీసులు కూడా అనుమతించలేదు. ఫలితంగా సదస్సును తెనాలికి మార్చారు. అప్పట్లో కమ్యూనిస్టు ఉద్యమానికి తెనాలి అండగా ఉండేది. తెనాలిలో సదస్సు నిర్వహణకు జాతీయ కౌన్సిల్ వాకౌట్ సభ్యులు నిర్ణయించినట్టు వార్త రావటం ఆలస్యం, మరో గంటలోనే పట్టణంలోని లాడ్జిలు, హోటళ్లన్నింటినీ ప్రభుత్వ అధికారులే బుక్ చేశారు. పార్టీ ప్రతినిధులు, నాయకులకుఎక్కడా వసతి దొరకని పరిస్థితిని కల్పించారు. ప్రత్యామ్నాయంగా పట్టణ చెంచుపేటలోని కోనేరు పక్కన ఖాళీగా ఉన్న రైస్‌మిల్లును సదస్సు ప్రధాన ప్రాంగణంగా ఉపయోగించారు. మిల్లు పేరు రాజరాజేశ్వరి రైస్‌మిల్లు. ప్రతినిధుల భోజనశాలకు పక్కనే తాటాకు పాక వేశారు. సదస్సు ప్రాంగణానికి కోటేశ్వరనగర్‌గా నామకరణం చేశారు.

దేశం నలుమూలల నుంచి 146 మంది ప్రతినిధులు

సదస్సుకు దేశవ్యాప్తంగా 146మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్ నుంచి 23 మంది చొప్పున హాజరుకాగా, తమిళనాడు నుంచి 20, కేరళ నుంచి 19, ఉత్తరప్రదేశ్ 15, రాజస్థాన్, పంజాబ్, అస్సాం, ఢిల్లీ, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్నుంచి 40 మందికిపైగా పాల్గొన్నారు. సీపీఐ జాతీయ సదస్సు నుంచి వాకౌట్ చేసిన 32 మంది సభ్యులు హాజరయ్యారు. వీరిలో మార్క్సిస్టు పార్టీ తొలి పొలిట్‌బ్యూరోకు ఎన్నికైన పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, ఏకే గోపాలన్, ఈఎంఎస్ నంబూద్రిపాద్, జ్యోతిబసు, ప్రమోద్ దాస్ గుప్త, హరికిషన్‌సింగ్ సూర్జిత్, పి.రామమూర్తి ప్రభృతులున్నారు. వీరితోపాటు పంజాబ్ నుంచి జగ్‌జిత్‌సింగ్ లాయల్‌పురి, బెంగాల్ నుంచి ముజఫర్ అహ్మద్, హరేకృష్ణ కోవార్, తమిళనాడు నుంచి ఎంఆర్ వెంకటరామన్, శంకరయ్య, కేరళ నుంచి ఈకే నయనార్, కనరన్, రాజస్థాన్ నుంచి మోహన్ పునామియా తదితరులున్నారు. బీటీ రణదివే జైలులో ఉన్నందున హాజరుకాలేదు.వాకౌట్ చేసిన సభ్యుల్లో మన రాష్ట్రంనుంచి పుచ్చపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్యతోపాటు నండూరి ప్రసాదరావు, మోటూరి హనుమంతరావు, తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, గుంటూరు బాపనయ్య, ఉద్ధంరాజు రామం ఉన్నారు. వీరితోపాటు గుంటూరుజిల్లా నుంచి కొల్లా వెంకయ్య, కృష్ణాజిల్లాకు చెందిన సనకా బుచ్చికోటయ్య, మానికొండ సుబ్బారావుతో సహా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

బసవపున్నయ్య డాక్యుమెంట్‌తో..

తెనాలి సదస్సులో మార్క్సిస్టు పార్టీ కార్యక్రమం, ఎత్తుగడలపై చర్చలో జ్యోతిబసు, బసవపున్నయ్య, నంబూద్రిపాద్‌లు వేర్వేరు డాక్యుమెంట్లను సమర్పించారు. వీటిపై సదస్సులో విస్తృతంగా చర్చ జరిగింది. ఎక్కువమంది మాకినేని బసవపున్నయ్య డాక్యుమెంటునే అంగీకరించటంతో అదే సీపీఎం కార్యక్రమంగా రూపొందించారు. నాలుగోరోజైన జులై 12న గాడిబావి సెంటర్లో బహిరంగసభ నిర్వహించారు. దాదాపు పదివేలమంది హాజరయ్యారు. బసవపున్నయ్య, సుందరయ్య, ప్రమోద్‌దాస్ గుప్త తదితరులు ప్రసంగించారు. సదస్సు ఏర్పాట్లను కామ్రేడ్ లావు బాలగంగాధరరావు, కొరటాల సత్యనారాయణ, పరుచూరు నాగేశ్వరరావు పర్యవేక్షించారు. పార్టీ అగ్రనాయకుడు మాకినేని బవసపున్నయ్య సతీమణి, బాలగంగాధరరావు సోదరి జగదాంబ తీవ్ర అస్వస్థతతో ఉండటంతో బాలగంగాధరరావు సదస్సు సమయంలో అక్కడ లేరు. సదస్సులో ప్రవేశపెట్టే పత్రాలను చాలవరకు బసవపున్నయ్య ఇంటివద్దనే తయారుచేశారు. చెంచుపేటకు చెందిన రావి హైమారావు, రావి అమ్మయ్య, పార్టీ కార్యకర్తలు సదస్సు ఏర్పాట్లలో సహకరించారు. గడ్డిపాటి కోటేశ్వరరావు, కొండ్రగంట వెంకటేశ్వర్లు, రాచాబత్తుని నాగేశ్వరరావు, గుదిబండి శివబసివిరెడ్డి, దేవా సీతారామయ్య, దొడ్డపనేని వెంకటేశ్వరరావు, సింహాద్రి శివారెడ్డి తదితరులు వలంటీర్లుగా వ్యవహరించారు. కమ్యూనిస్టు ఉద్యమానికి తెనాలిలో గట్టి పట్టు ఉండటంతో అగ్రనేతల భావనకు తగినట్టుగా తెనాలి సదస్సు విజయవంతమైంది. స్వాతంత్ర్యానికి పూర్వమే ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో తెనాలి అసెంబ్లీ (తెనాలి, రేపల్లె కలిపి)కి ఏకైక కమ్యూనిస్టు ఎమ్మెల్యేగా పిల్లలమర్రి వెంకటేశ్వర్లు విజయం సాధించారు. 1952లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డాక జరిగిన ఎన్నికల్లోనూ తెనాలి కమ్యూనిస్టు నేత రావి అమ్మయ్య గట్టి పోటీనిచ్చారు. మున్సిపాలిటీలోనూ కమ్యూనిస్టు పార్టీ బలమైన ప్రతిపక్షంగా ఉండేది.